నమస్తే తెలంగాణ

ఖమ్మం

12 | ఖమ్మం, మంగళవారం 18 మార్చి 2025 | KHAMMAM


# రైల్వే సమస్యలను పట్టించుకోని ఎన్డీఏ

**రాజ్యసభలో ధ్వజమెత్తిన ఎంపీ రవిచంద్ర**

ఖమ్మం, మార్చి 17 : రాముడి పేరుతో రాజకీయం చేసే ఎన్డీఏ ప్రభుత్వం.. అదే రాముడు నడయాడిన భద్రాచలం క్షేత్రంతోపాటు, తెలంగాణలోని రైల్వే సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. బడ్జెట్‌లో రైల్వేశాఖకు కేటాయించిన నిధులపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన తెలంగాణకు సంబంధించిన పలు రైల్వే సమస్యలను ప్రస్తావించారు. రఘుపతి రాఘవ రాజారామ్ అనే రాముడి కావ్యంతో చర్చను ప్రారంభించిన వద్దిరాజు దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం క్షేత్రానికి రైలుమార్గం అనుసంధానించే భద్రాచలం- కొవ్వూరు రైల్వేలైన్ దశాబ్దాల నుంచి కలగా ఉంటోందని, ఈ కల సాకారం కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని చెప్పారు. భద్రాచల క్షేత్రం ప్రాశస్త్యాన్ని గుర్తించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లాల పునర్విభజన కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా నామకరణం చేసి రాముడిపై తనకున్న అపార భక్తిని చాటుకున్నారని గుర్తుచేశారు. రైల్వే ఆదాయానికి అధికశాతం నిధులు సమకూరుస్తున్నా తెలంగాణలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదని వాపోయారు. ఉత్తర, దక్షిణ భారతదేశానికి ప్రవేశ ద్వారంగా ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్‌గా గుర్తించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉందన్నారు. దక్షిణ మధ్యరైల్వేకు 48శాతం ఆదాయం సమకూరుస్తున్న కాజీపేటను ప్రత్యేక డివిజన్‌గా గుర్తిస్తే.. లాభదాయకంగా ఉంటుందని రవిచంద్ర ప్రస్తావించారు. సిద్దిపేట జిల్లాలో చిన్నకోడూరు రైల్వేస్టేషన్ మంజూరు, నిజామాబాద్, మంచిర్యాల, భద్రాచలం రోడ్ నుంచి తిరుపతికి నూతన రైలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల వేగవంతం, కొత్త బ్రిడ్జిల మంజూరు, రైల్వేస్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రవిచంద్ర కోరారు.



రాజ్యసభలో ప్రసంగిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

# మెడలో మిర్చి దండలు..

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వినూత్న నిరసన**

ఖమ్మం, మార్చి 17 : రాష్ట్రంలో మిర్చి ధరలు గణనీయంగా తగ్గడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆవరణలో మిర్చి దండలు మెడలో వేసుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వానకాలం సీజన్‌లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు కాగా.. ధర లేకపోవడంతో ఈ వానకాలం 2లక్షల 40వేల ఎకరాల విస్తీర్ణం తగ్గిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మిర్చికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 వేలు కల్పించి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ ఎగుమతికి చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ మిర్చి పంటను సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి ఆహారపంటల జాబితాలో చేర్చాలన్నారు. మిర్చి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ, ఖమ్మంజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, నవీన్‌కుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, యాదవ్‌రెడ్డి పాల్గొన్నారు.



కౌన్సిల్ హాల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ భూగర్భ జలాలు రోజురోజుకూ దిగువకు పోతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చెరువులు చాలావరకు ఎండిపోయే స్థితికి వచ్చేశాయి. చేలల్లో బోర్లు సైతం రెండున్నర అంగుళాల దార పోసేవి అరంగులమే పోస్తున్నవి. దీంతో యాసంగి పంటలకు నీరు అందడం లేదు. పొలాలు నెర్రెలు బారుతున్నాయి. రైతులు ఇంజిన్లు పెట్టి చెరువుల్లో ఉన్న కాస్త నీటిని తోడుకొని మరీ పంటలను కాపాడుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా కొన్ని మండలాల్లో సాగునీటి సమస్య రైతుల్ని తీవ్రంగా వేధిస్తున్నది. విద్యుత్ సరఫరాలో సైతం తీవ్ర అంతరాయం కలుగుతుండడం, రాత్రులు త్రీఫేజ్ కరెంట్ లేకపోవడంతో అన్నదాతలు మరింత ఆవేదన చెందుతున్నారు. - భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 17 (నమస్తే తెలంగాణ)


చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెంలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంట



- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండిపోతున్న యాసంగి పంటలు
- గతేడాది కంటే రెండు మీటర్లు లోపలికి..
- నీటిమట్టం ముున్ముందు మరింత తగ్గే ప్రమాదం
- ఆందోళనలో అన్నదాతలు
- మరో వైపు రైతులను వేధిస్తున్న విద్యుత్ కోతలు

# రోజురోజుకూ దిగువకు..

వానకాలంలో పంటలకు సరిపడా వర్షపాతం నమోదైనప్పటికీ ఈ వేసవిలో భూగర్భ జలం మాత్రం భారీగా తగ్గిపోయింది. 2024-25 సంవత్సరంలో సాధారణ వర్షపాతం 1,198 మిల్లీమీటర్లు కాగా.. 1,752 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అంటే 46 శాతం అదనంగా వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. కానీ.. గత ఏడాది ఫిబ్రవరిలో 8.66 మీటర్లలో భూగర్భ నీటిమట్టం ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 9.45 మీటర్ల లోతుకు దిగిపోయింది. జనవరిలో ఈ ఏడాది 8.55 మీటర్ల లోతులో నీరు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు రెండు నెలల్లో 2.57 మిల్లీమీటర్ల భూగర్భ జలం తగ్గినట్లు భూగర్భ శాఖ అధికారులు చెబుతున్నారు.

## మరింత తగ్గే అవకాశం

మార్చిలోనే ఇలాంటి ఎండలు ఉండడం చూస్తుంటే రానురాను భూమిలోని జలం మరింత తగ్గే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ఇప్పటికే 1.16 లక్షల ఎకరాల్లో పంటలను వేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వరితోపాటు మొక్కజొన్న పంటలకు కూడా తడి అందకపోవడంతో ఎండిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు చెరువులో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టేకులపల్లి చెరువులో నీరు ఉన్నా పొలాలకు అందకపోవడంతో ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామంలో బోరులో అరంగుళం మాత్రమే నీరు వస్తుండడంతో వరి ఎండిపోతున్నది. సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో నీరు ఉన్నా చేపల పెంపకం వల్ల కాలువల్లోకి వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. మరో వైపు కరెంటు కోతలు రైతుల్ని పట్టి పీడిస్తున్నది మరో సమస్యగా మారింది. రాత్రుల సమయంలో త్రీఫేజ్ కరెంటు ఇవ్వకపోవడంతో మోటర్లు నడిచే పరిస్థితి లేకుండా పోయింది.

## జలశక్తి ద్వారా అధికారుల ప్రయత్నాలు

భూగర్భ జలాలు తగ్గకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఉపాధిహామీ ద్వారా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సైతం రైతులు ఫాం పాండ్‌లు నిర్మించుకోవాలని, ప్రతి గ్రామంలో యుద్ధప్రాతిపదికన ఇంకుడు గుంత తవ్వాలని ఒకరోజు స్పెషల్ డ్రైవ్ పెట్టారు. లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీ కాలనీలో స్థానిక యువతతో కలిసి కలెక్టరే స్వయంగా ఇంకుడు గుంతను తవ్వారు. అదే స్ఫూర్తితో అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఈ దిశగా అధికారుల ప్రయత్నాలు జరుగుతాయా.. లేదా.. అనేది వేచిచూడాలి.


నీటిమట్టం తగ్గిన ఆళ్లపల్లి రేగడిచెరువు

### హెచ్చుతగ్గులు సహజమే..

ఈ ఏడాది వర్షపాతం బాగానే ఉంది. అదనంగా 46 శాతం పడింది. కానీ.. గతేడాది కంటే 2 మీటర్ల భూగర్భ జలం తగ్గింది. యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలి. రైతులు ఉపాధిహామీ ద్వారా ఫాం పాండ్‌లను నిర్మించుకోవాలి. తద్వారా నీటిని పొదుపు చేసుకోవచ్చు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే భూగర్భ జలం స్థిరంగా ఉంటుంది.

**– రమేశ్, జిల్లా భూగర్భ జలశాఖాధికారి, భద్రాద్రి కొత్తగూడెం**



### బోరులో నీరు తగ్గింది..

భూమిలో జలం బాగా తగ్గింది. గతంలో మా బోరు రెండున్నర అంగుళాలు పోసేది. ఇప్పుడు అరంగుళం మందం నీరు వస్తున్నది. ఇలా పోస్తే పొలానికి నీరు సరిపోదు. వచ్చే నెలలో ఇంకా తగ్గిపోతుంది. ఇప్పటికే వరి పంట ఎండిపోతున్నది. రానున్న రోజులు రైతులకు గడ్డుకాలమే.

**–నరకుల్ల అప్పాజీ, అయ్యన్నపాలెం, చంద్రుగొండ మండలం**



### కరెంటు కోతలు బాగా ఉన్నాయి..

కరెంటు సక్రమంగా ఉండడం లేదు. దీంతో పొలానికి సక్రమంగా తడి పెట్టలేక పోతున్నాం. బోరులో నీరు ఉన్నా కరెంటు లేకపోవడం మాలాంటి వాళ్లకి ఇబ్బందిగా ఉంది. భూగర్భ జలం ఈ ఏడాది తగ్గింది. ఎండాకాలం చెరువులు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉంది. కనీసం కరెంటు సమస్య లేకుండా చూడాలి.

**–కుంజా వీరాస్వామి, లింగగూడెం, గుండాల మండలం**



# తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

**'మిషన్ భగీరథ' నీళ్లు రాకపోవడంతో పాతర్లగడ్డవాసుల అవస్థలు**

**పంచాయతీ ట్యాంకర్‌తో సొంత డబ్బులతో నీళ్లు తెప్పించుకుంటున్న గ్రామస్తులు**

**చర్ల మండలం ఆర్.కొత్తగూడెంలో ఖాళీ బిందెలతో ఎస్సీ కాలనీ వాసుల రాస్తారోకో**


టేకులపల్లి మండలం పాతర్లగడ్డ గ్రామంలో ట్యాంకర్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇల్లెందు/ చర్ల, మార్చి 17: బోర్లలో నీళ్లు లేకపోవడం, మిషన్ భగీరథ నీళ్లు నెల రోజులుగా రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు సోమవారం ఖాళీ బిందెలతో రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఎండల తీవ్రతతో బోర్లలో నీరు ఇంకిపోయిందని, దీనికితోడు మిషన్ భగీరథ నీళ్లు కూడానెల రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడం లేదని, దీంతో తామే ఇంటికి కొంత జమ చేసి పంచాయతీ ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించుకుంటున్నామని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రోజూ తాగునీరు వచ్చేలా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అలాగే, చర్ల మండలం ఆర్.కొత్తగూడెం పంచాయతీ ఎస్సీ కాలనీ వాసులు కూడా తాగునీటి కోసం రోడ్డెక్కారు. ఆర్.కొత్తగూడెం నుంచి ఇప్పటి వరకూ ఇస్తున్న మిషన్ భగీరథ నీళ్లు తమ కాలనీకి చేరుకోలేకపోతున్నాయని, అందుకని తమ ఇళ్లకు నీళ్లు సరఫరా కావడం లేదని, దీంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో ప్రత్యేకంగా ట్యాంకు నిర్మించి తమకు సమృద్ధిగా నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.


చర్ల మండలం ఆర్.కొత్తగూడెంలో ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

# ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

- మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రతిపాదనను రద్దుచేయాలి
- కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలుచేయాలి
- భద్రాద్రి జిల్లాలో చేపట్టిన ఆందోళనలో అంగన్‌వాడీలు

అశ్వారావుపేట టౌన్/ దుమ్ముగూడెం/ చర్ల/ టేకులపల్లి/ ఇల్లెందు రూరల్/ మణుగూరు టౌన్, మార్చి 17: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని అంగన్‌వాడీలు ఆరోపించారు. ఇందుకోసం తీసుకొస్తున్న జాతీయ విద్యావిధానాన్ని, పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీలు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అశ్వారావుపేట, చర్ల, దుమ్ముగూడెం, టేకులపల్లి, ఇల్లెందు, మణుగూరు మండలాల్లో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రమోషన్ పొందిన మినీ అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు సూచనల ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలుచేయాలని, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా మండలాల్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.


మణుగూరు టౌన్: ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

# సమయం లేదు.. నిధులు ఖర్చు చేయండి!

- అదనపు కలెక్టర్ ఆదేశాలతో పాలుపోని విద్యాశాఖ
- ఖర్చు చేసిన వాటి యూసీలు సమర్పించాలని ఆదేశం
- ఒకేసారి ఇంత ఒత్తిడి తెస్తే ఎలా అంటున్న ఉపాధ్యాయులు

ఖమ్మం అర్బన్, మార్చి 17: ప్రభుత్వ పాఠశాలలకు విద్యాసంవత్సరం మొత్తంలో పలు అంశాలకు కేటాయించిన నిధులు.. వాటికి అనుగుణంగా ఖర్చు చేసి.. అందుకు సంబంధించిన యూసీ (యుటిలైజేషన్ సర్టిఫికెట్)లు అందజేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ సోమవారం ఆదేశించడంతో విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇప్పటివరకు చాలా స్కూళ్లలో గ్రాంట్స్‌ను ఖర్చు చేసిన దాఖలాలు లేకపోవడంతో తర్జనభర్జన పడుతున్నారు. అదనపు కలెక్టర్ ఆదేశాలతో ఏమి చేయాలో పాలుపోక విద్యాశాఖ అధికారులు జూమ్ మీటింగ్ నిర్వహించి పదిహేను రోజుల్లో నిధులు ఖర్చు చేయాలని, ఉన్నతాధికారులతో మాట రాకుండా చూసుకోవాలని సలహా ఇచ్చారు. నిధులు కొన్నే ఖర్చు చేసినా పూర్తిస్థాయి యూసీలు అందజేయబోతున్నట్లు తెలుస్తున్నది.

**పాఠశాలలకు గ్రాంట్ ఇలా..**

పాఠశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.12,500 నుంచి రూ.లక్ష వరకు రెండు విడతలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. అయితే విద్యాసంవత్సరం మొదట్లో నిధులు లేక చాక్‌పీసులు కొనలేని పరిస్థితుల్లో పాఠశాలలను భారంగా నడపాల్సిన పరిస్థితి నెలకొంది. స్పోర్ట్స్ గ్రాంట్ ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, యూపీఎస్‌లకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేలు, సెల్ఫ్ డిఫెన్స్ గ్రాంట్ రూ.15 వేలు, సేఫ్టీ సెక్యూరిటీ గ్రాంట్ రూ.15 వేలు, బడిబాట నిధులు రూ.వెయ్యి, కాంప్లెక్స్ గ్రాంట్ రూ.33 వేలు, ఎంఆర్‌సీ గ్రాంట్ రూ.82,920, టెన్త్ స్నాక్స్ ప్రతి విద్యార్థికి రోజుకి రూ.15 చొప్పున 38 రోజులకు విడుదలయ్యాయి. యూత్ అండ్ ఎకో క్లబ్ నిర్వహణకు రూ.5 వేలు, రూ.3 వేలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు రూ.వెయ్యి చొప్పున నిధులు విడుదలయ్యాయి.

**ఎంఈవోలకు ఆదేశాలు**

గ్రాంట్స్ ఖర్చులకు సంబంధించి యూసీలు, ఫొటోగ్రాఫ్‌లతో అందజేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఎంఈవోలను ఆదేశించారు. దీనిపై ఈ నెల 31వ తేదీలోగా పూర్తి నివేదిక పొందుపర్చాలని స్పష్టం చేశారు. నివేదిక అందజేయకపోతే సీరియస్‌గా పరిగణించనున్నట్లు హెచ్చరించారు. వెంటనే రంగంలోకి దిగిన విద్యాశాఖాధికారులు..



నిధులు ఎలా ఖర్చు చేయాలనే మార్గాలు అన్వేషించారు. ఒక వేళ ఖర్చు చేయకపోతే వాటిని డ్రా చేసి జూన్ నాటికి ఖర్చు చేస్తామని అండర్ టేకింగ్ అందజేయాలని సూచనలు చేశారు. అయితే దీనిపై కొందరు టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంవత్సరం మొదట్లో ఇవ్వాల్సిన గ్రాంట్ ఇప్పుడు ఇచ్చి ఖర్చు చేయాలని వెంటబడితే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. పరీక్షల వేళ విద్యార్థులను సన్నద్ధం చేసే పనిలో, పరీక్ష విధుల్లో ఉంటే ఇప్పుడు ఒత్తిడి తెస్తే ఎలా? అంటున్నారు.

**క్రీడా పరికరాలు కొనని చాలా స్కూళ్లు..**

జిల్లాలోని అత్యధిక స్కూళ్లలో క్రీడా పరికరాలు, ఆట వస్తువులు లేనే లేవు. నిధులు కేటాయించినా హెచ్ఎంలు ఇప్పటివరకు వాటిని కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వలేదు. పీఈటీలు కొందామంటే కొన్ని ఇబ్బందులు, హెచ్ఎంలు కొంటే అనేక ఊహాగానాలు ఎదురయ్యాయి. దీంతో కొనుగోలు చేయలేదు. ఇలా పలు కారణాలతో అత్యధిక గ్రాంట్స్ అలానే ఉన్నాయి. కేంద్ర బడ్జెట్ కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు చేయకపోతే మళ్లీ వెనక్కిపోతాయనే ఉద్దేశంతో ఖర్చు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో కేజీబీవీకి రూ.లక్ష వరకు అందజేసే ఆలోచనలో కలెక్టర్, అదనపు కలెక్టర్ ఉన్నారు. రూ.25 వేలు క్రీడా పరికరాల కోసం, మరో రూ.75 వేలు ఇతర అవసరాల కోసం.. అది కూడా ఈ నెల 31లోపు ఖర్చు చేసి వివరాలు అందజేయాల్సి ఉంటుంది. విద్యాశాఖపై అదనపు కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో ఎలాంటి వివరాలు అందజేస్తారో చూడాలి.

# పెండింగ్ వేతనాల కోసం ధర్నా

**అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల డిమాండ్**



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

తిరుమలాయపాలెం, మార్చి 17 : పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాలకు చెందిన గ్రామపంచాయతీ కార్మికులు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నెలలతరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారీగా చెల్లించే జీతాలను జాప్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రామదాసు, పాలేరు డివిజన్ అధ్యక్షుడు పుల్లయ్య, మండల అధ్యక్షుడు మీగడ సైదులు, నాయకులు భిక్షం, ఎల్లయ్య, రమేశ్, రవి, రాజేశ్, ఉమేశ్, సురేశ్, వెంకటేశ్వర్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.